అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డులు

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 288 శుక్రవారం13 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మూసీ ప్రాజెక్టుకు 100 ఎకరాలు

# బదలాయించండి

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

**హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టులకు 500 ఎకరాలు కేటాయిస్తాం -అంతర్జాతీయస్థాయిలో మామునూరు ఎయిర్‌పోర్ట్ కట్టండి**

**మంత్రులు అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్ నాయుడుకు వినతి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):**
మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో రెండో రోజు ఆయన పలువురు కేంద్రమంత్రులను కలిశారు. తొలుత రాజ్‌నాథ్ సింగ్‌తో సౌత్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యి మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు గురించి వివరించారు. ఈసా.. మూసీ నదుల సంగమస్థలిలో.. 1948లో మహాత్ముడి చితాభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపన, మిగతా 2లో...

# శ్రామిక జనగర్జన

## కదం తొక్కిన కార్మిక లోకం

**సార్వత్రిక సమ్మె సక్సెస్ -బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిన ప్రదర్శన**

**నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాల్సిందే.. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తా్తరార్మిక సంఘాల నేతలు**




**హైదరాబాద్ ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):**
మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ గురువారం కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సక్సెస్ అయింది. హైదరాబాద్‌లో జరిగిన ఆందోళనా కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ అనుబంధ సంఘాల నుంచి వేలాదిమంది కార్మికులు, రోడ్లపైకి వచ్చి మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలంటూ కదం తొక్కారు. స్థానిక ఆర్టీసీ కళ్యాణ మండపం నుంచి ప్రారంభమైన కార్మిక, కర్షక, ప్రజా ప్రదర్శన ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్‌నగర్ చౌరస్తా మీదుగా ఇందిరా పార్కు వరకు కొనసాగింది. మిగతా 2లో...

## 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు

# కేంద్రం గ్రీన్‌సిగ్నల్




న్యూఢిల్లీ: ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలకమైన డిఫెన్స్ డీల్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన డీల్ ఇది. ఈ డీల్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత నావికా దళం కోసం 6 పీ8ఐ (ా8ఐ) విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను కూడా ఆమోదించినట్టు తెలిపాయి. మిగతా 2లో...

# ఉద్యోగాలొస్తాయ్

## తక్కువధరకు భూములిస్తే తప్పేంటి

**ఇందులో లాలూచీ ఏమీ లేదు: మంత్రి లోకేశ్**

**ఆరోపణలు నిరూపించాలని వైసీపీకి సవాల్**

**మండలిలో అధికార, విపక్షాల మాటల యుద్ధం**



అమరావతి,. **ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):**
శాసన మండలిలో గురువారం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. పరిశ్రమలకు భూముల కేటాయింపులు, పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రులు, విపక్ష సభ్యుల సవాళ్లు, ప్రతి సవాళ్లతో మండలి హోరెత్తింది. తొలుత 99 పైసలకే భూ కేటాయింపుల అంశంపై వాడీవేడీ చర్చ జరిగింది. ఎకరా 99 పైసలకే ఏ పరిశ్రమకు, ఎంతెంత భూమి కేటాయించారు? పరిశ్రమలతో ప్రభుత్వ ఒప్పందాలు ఏంటని వైసీపీ సభ్యులు మాధవరావు, కళ్యాణి, రవీంద్రబాబు ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ సమాధానం చెప్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో టీసీఎస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎవీసఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకే ఎకరా 99 పైసలకు భూములు కేటాయించామని, దీని వల్ల ఐటీ రంగంలో 65 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగామిగతా 2లో...

## ఉద్యోగులకు ఆరోగ్యమస్తు

**త్వరలోనే 1,056 కోట్లతో బీమా పథకం.. ప్రభుత్వం, ఉద్యోగుల చెరి సగం వాటా**

**సిబ్బంది మూల వేతనం నుంచు? 1.5 కట్**

**'ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్టు' ద్వారా సేవలు**

**15 రోజుల్లో పథకం ప్రారంభానికి చర్యలు**



# నేడు కౌంటింగ్

**ఉదయం 8 గంటల నుంచిమున్సిపోల్స్ ఓట్ల లెక్కింపు**

**రాష్ట్రవ్యాప్తంగా 123 కేంద్రాల ఏర్పాటు -రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి**




హైదరాబాద్ **ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల ఓట్ల లెక్కింపుకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు కోసం 123 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 10 వేల మంది సిబ్బంది లెక్కింపులో పాల్గొంటారు. మున్సిపాల్టీ, కార్పొరేషన్లలోని వార్డుల సంఖ్య ఆధారంగా 15 నుంచి 35 వరకు టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్‌పై జరుగుతున్న లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారామిగతా 2లో...

## తెలంగాణ పంచాయతీలకు

# రూ.387 కోట్లు

**వారం క్రితం తొలి విడతలో రూ.259.63 కోట్లు విడుదల**

**రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులు విడుదల**

**పెండింగ్‌లో ఉన్న మరో రూ.2,400 కోట్ల నిధులు**



# నా గొంతు నొక్కేందుకే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు

**అసెంబ్లీలో మాట్లాడే చాన్స్ లేనందునే మీడియాతో మాట్లాడుతున్నా: జగన్**

**'కల్తీ నెయ్యి'తో వైసీపీకి సంబంధం లేదంటూ అవే అబద్ధాలు**

**అమరావతి,ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):**
అసెంబ్లీలో తన గొంతు నొక్కేందుకే ప్రధాన ప్రతిపక్షనేత హోదా ఇవ్వడంలేదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సభలో ఏకైక ప్రతిపక్ష పార్టీ వైసీపీ అయినా ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. గురువారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబుతో సమానంగా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశపూర్వకంగా తనకు హోదా ఇవ్వడం లేదని అన్నారు. బడ్జెట్‌పై అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాగొంతుకై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకూడదనేమిగతా 2లో...



అమక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607 తెలుగు దిన పత్రిక

# మూసీ ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించండి

(మొదటి పేజీ తరువాయి)

భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని రక్షణమంత్రిని ఆహ్వానించారు. రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసి.. కృష్ణా-వికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయం మొత్తాన్నీ తామే భరిస్తామని ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైలు మార్గంలోని టేకల్‌కోడ్‌లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని.. సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నామని తెలిపారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు. అలాగే.. హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూర్, హైదరాబాద్-పుణే హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని రైల్వే మంత్రికి సీఎం తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని కోరారు. హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని విన్నవించారు. దాంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతం అవుతుందని తెలియజేశారు. హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ – పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్‌అవుతుందని వివరించారు. ఈ మూడు కారిడార్లకూ వెంటనే భూసేకరణ చేసి, పనులు ప్రారంభించాలని కేంద్రమంత్రిని కోరారు. సీఎం విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇక.. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కలిసి.. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌కు సమీపంలో నిర్మించనున్న మామునూరు ఎయిర్‌పోర్ట్ పనులు వెంటనే చేపట్టి, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయంలో కార్గో సేవలతోపాటు మెయింటెనెన్స్.. ఓవర్ హాల్ రిపేర్ (ఎంవోఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. దాని ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సీఎం విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు.. విమానాశ్రయ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను పంపిస్తానని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించడంపై రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ సీఎం రేవంత్‌ను అభినందించారు.

# ఉద్యోగాలొస్తాయ్

(మొదటి పేజీ తరువాయి)

4-5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే భూములిచ్చామని, ఇందులో లాలూచీ ఏమీ లేదని స్పష్టం చేశారు. 'నన్ను విమర్శించాలనుకుంటే విమర్శించండి.. కప్పు కాఫీ, టీ తప్ప ఆయా కంపెనీల నుంచి నేనేమైనా తీసుకుంటే నిరూపించండి. విశ్వసనీయత లేని కంపెనీలకు తక్కువ ధరకు భూములిచ్చామని నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం' అని సవాల్ చేశారు.

పక్క రాష్ట్రాలతో పోటీ పడాల్సిన అవసరం ఉంది కాబట్టే.. తక్కువ ధరకు భూములిచ్చామని లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీఐఐసీని కాదని రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములెందుకు ఇస్తున్నారని విపక్ష నేత బొత్స ప్రశ్నించగా, టాటా నానో ఫ్యాక్టరీని బెంగాల్‌లో తరిమేయడంతో నాటి గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ 99 పైసలకే భూమి ఇస్తామని తమ రాష్ట్రానికి తీసుకెళ్లారని, దీంతో అక్కడ ఎకో సిస్టమ్ ఏర్పడిందన్నారు. ఇప్పుడు విశాఖనూ ఐటీ కేంద్రంగా మారుస్తున్నామన్నారు. భూ కేటాయింపుపై వైసీపీ పిల్ వేయించగా, కోర్టు మొట్టికాయలు వేసిన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు.

మంత్రి అచ్చెన్నాయుడు కల్పించుకొని.. మంచి కంపెనీలకే తక్కువ ధరకు భూములిస్తున్నామని, తమ కుటుంబసభ్యులకు ఇవ్వట్లేదని వ్యాఖ్యానించారు. భూకేటాయింపులపై వాదోపవాదాల నేపథ్యంలో వైసీపీ సభ్యులు మండలి నుంచి వాకౌట్ చేశారు. మంత్రి లోకేశ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కావడం లేదన్నారు. 'బొత్సకు ఇదో ఫ్యాషన్. ఆ తలుపు నుంచి వస్తారు. ఈ తలుపు నుంచి వెళ్తారు' అని అన్నారు. మా ప్రభుత్వ లక్ష్యం కోసం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కియ పరిశ్రమ రాకతో ఆ ప్రాంతం మారిందన్నారు. క్లస్టర్ విధానంతో ముందుకు వెళు_న్నామని, ముందుకొచ్చిన ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

పైసలకే భూమి ఇస్తారా? అని వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై లోకేష్ దీటుగా స్పందించారు. 5 కంపెనీలకే భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావిస్తున్నందున, ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. ఉర్సా కంపెనీకి భూమి కేటాయించలేదని స్పష్టం చేశారు. అయినా వైసీపీ సభ్యులు కేకలు పెడుతుండటంతో.. 'లెక్కల్లోకి వెళ్తే.. 151 కాస్తా.. 11 అయ్యాయి. దీనిపైనా చర్చిద్దామా?' అని అన్నారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పరిశ్రమల్ని తరిమేయాలని వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వం భారీగా పింఛన్లు తొలగించిందని, కొత్త పింఛన్లు ఇవ్వలేదని వైసీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో 10 లక్షల పింఛన్లు తొలగించారని, అనర్హులకు అక్రమంగా పింఛన్లు ఇచ్చారని విమర్శించారు. తమ 20 నెలల పాలనలో ఎవరి పింఛనూ తీసేయలేదని స్పష్టం చేశారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల రీవెరికేషన్ చేసి, పింఛన్ కొనసాగిస్తున్నామన్నారు. కొత్తగా 2.50 లక్షల స్పౌజ్ పింఛన్లు ఇచ్చామన్నారు. 2019-24 మధ్య పింఛన్లకు రూ.91 వేల కోట్లు ఖర్చు చేయగా, తమ ప్రభుత్వం 20 నెలల్లో రూ.55 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. గతంలో టీడీపీ ప్రభుత్వం 54.10 లక్షల పింఛన్లు ఇస్తే, వైసీపీ ప్రభుత్వం పార్టీ ముద్ర వేసి, లక్షల పింఛన్లు నిలిపివేసిందన్నారు.

## బొత్స వర్సెస్ మంత్రి పార్థసారథి

'తల్లికి వందనం' కింద ఎంత మంది పిల్లలున్నా ఏటా ఒకొక్కరికి రూ.15 వేలు వేస్తామని మోసం చేశారని, 15 శాతం మందికి రూ.7-8 వేలు మించి పడలేదని బొత్స ఆరోపించారు. నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్థసారథి సవాల్ చేశారు. 48 లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ' లబ్ధి చేకూరితే.. ఏ రైతుకూ రూ.20 వేలు పడలేదనడం సరికాదన్నారు. సాంకేతిక కారణంతో ఎక్కడో కొద్ది మందికి అలా జరిగి ఉండొచ్చని, అలాంటి వారి వివరాలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో 'అమ్మ ఒడి'ని ఇద్దరికీ ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేలు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మరోవైపు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరు మాత్రమే మార్చినట్లు వైసీపీ సభ్యులు తప్పుగా చెప్తున్నారని, యాక్ట్‌ను పూర్తిగా రద్దు చేశామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

**ఉయ్యాలవాడ, బుడ్డాను గౌరవించేలా: దుర్గేశ్**

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి స్మారక మ్యూజియాల ఏర్పాటుపై టీడీపీ సభ్యులు రాంగోపాల్‌రెడ్డి, బీటీ నాయుడు, బీద రవిచంద్ర వేసిన ప్రశ్నకు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ సమాధానం చెప్పారు. స్వాతంత్ర్య సమరంలో వీరోచితంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కరువు సమయంలో పేద ప్రజలకు యావదాస్తి దానం చేసిన బుడ్డా వెంగళరెడ్డి పేరిట స్మారకాల ఏర్పాటుపై పరిశీలిస్తామని చెప్పారు. వారిద్దరి జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.

**ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదు: బొత్స**

అసెంబ్లీ బయట బొత్స మీడియాతో మాట్లాడుతూ.. 99 పైసలకు ఇష్టారాజ్యంగా భూములు ఇవ్వడంపై ప్రశ్నించామని, ప్రభుత్వం సరైన సమాధానం చెప్పలేదన్నారు. అందుకే వాకౌట్ చేశామని పేర్కొన్నారు. స్వయానా సీఎం కుటుంబసభ్యులు రూ.5 వేల కోట్ల విలువైన భూములు సొంతం చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# శ్రామిక జనగర్జన

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం అక్కడ జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బరామారావు, టీయూసీఐ ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ పద్మ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, బీఆర్‌టీయూ కార్యదర్శి మారయ్య, ఏఐయూటీయూసీ నాయకులు భరత్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఏఐకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, అఖిల భారత ఐక్య రైతు సంఘం కార్యదర్శి ప్రభాకర్, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ జక్కుల వెంకటయ్య, ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు మాట్లాడారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్లు. అదానీ, అంబానీలతో పాటు మతోన్మాదుల ప్రయోజనాలకోసం కార్మికులు, కర్షకులపై యుద్ధం ప్రకటించిందని నాయకులు చెప్పారు. కార్మికుల ప్రయోజనాల కోసమే నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చినట్టు పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కోడ్‌లతో కార్మిక హక్కులను పారిశ్రామిక యజమానుల కోసం పణంగా పెట్టారని విమర్శించారు. ఇప్పటికే కార్మికులకు కనీస వేతనం అమలు కావటం లేదనీ, దీంతో వారి జీవనం దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గోరుచుట్టుపై రోకటిపోటులాగా ఉన్న హక్కులను ఊడపెరికితే..ఇక



కార్మికుడి బతుకు పెనం నుంచి పోయిలో పడిన చందంగా మారక తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులకు బీజేపీ ప్రభుత్వం సమాధి కడుతుంటే, బీఎంఎస్ దానికి అనుగుణంగా వ్యవహరిస్తున్నదని ఎద్దేవా చేశారు. సార్వత్రిక సమ్మె కార్మికుల జీతాల కోసమో, సంక్షేమం కోసమో కాదనీ, దేశ ప్రయోజనాల కోసం జరుగుతున్నదని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె సక్సెస్ అయిందనీ, అన్ని వర్గాల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ఎక్కడికక్కడ తమ నిరసనను తెలిపారన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయబోమంటూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో చర్చించకుండానే కార్మిక చట్టాలను రద్దు చేయటమేంటని ప్రశ్నించారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోడీ ప్రభుత్వం రైతాంగాన్ని మరో సారి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నా గొంతు నొక్కేందుకే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు

వైసీపీని ప్రతిపక్షంగా గుర్తించలేదని ఆరోపించారు. అసెంబ్లీలో వైసీపీకి బలం తక్కువని, పార్టీ గొంతు వినపడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని తెలిపారు. శాసనసభలో గొంతెత్తి మాట్లాడే అవకాశం లేనందునే మీడియాతో బయట మాట్లాడుతున్నామని అన్నారు. శాసనమండలిలో బలం ఉన్నందున అక్కడ ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడుదామని, ఎమ్మెల్సీలు సభలో గట్టిగా మాట్లాడాలని సూచించారు. కల్తీ నెయ్యి సరఫరాతో వైసీపీకి ఏమాత్రం సంబంధం లేదని, తమ ప్రభుత్వ హయాంలో జరగలేదని, సీబీఐ చార్జిషీట్‌లోనూ ఇదే ఉందన్నారు. సీబీఐ చార్జిషీట్‌కు చంద్రబాబు సమాధానం చెప్పాలని, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై ప్రశ్నించడాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు, విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర రెడ్డిపై దాడులు చేశారన్నారు. కాకాణి గోవర్ధనరెడ్డిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇవన్నీ చంద్రబాబు చేయించినవేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయమన్నారు.

# నేడు కౌంటింగ్

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి మానిటరింగ్ చేయనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను తెరుస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల వారీగా 25 చొప్పున బెండల్స్ కడతారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. తొలి ఫలితం మధ్యాహ్నం 12 గంటల వరకు వస్తుందని భావిస్తున్నారు.

తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మెన్ల ఎన్నికకు గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 16న సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం అదే రోజు ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొంది. ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహించనున్నామని తెలిపింది. నేరుగా ఎన్నికైన సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో మెంబర్లైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్నుకోనున్నారని పేర్కొంది. ఎన్నిక జరిగే ప్రాంతంలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, వాల్ క్లాక్, పార్టీల వారీగా సీట్ల ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది.

# 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌తో భారత వాయుసేన పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈనెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్‘లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా‘ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, భారత్‌లోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటారు. భారత వాయుసేన వద్ద ప్రస్తుతం 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

## తెలంగాణ పంచాయతీలకు రూ.387 కోట్లు

. **ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది. ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి.

# సభా హక్కుల తీర్మానం చేసినా వెనక్కి తగ్గను..



న్యూఢిల్లీ: లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తాను మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉంటానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తనపై సభా హక్కుల తీర్మానం పెట్టినా వెనుకంజ వేసేది లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు గురువారం నాడు ఒక వీడియోను ఆయన విడుదల చేశారు. తాను నిజమే చెప్పానని, చెబుతూనే ఉంటానని రాహుల్ పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి రాహుల్ గాంధీ లోక్‌సభలో బుధవారం నాడు జరిగిన బడ్జెట్ చర్చలో తీవ్ర విమర్శలు చేశారు. 'అమెరికాతో ట్రేడ్ డీల్‌లో ఎలాంటి లాజిక్ లేదు. భారత్ ఎలాంటి దామాషా ప్రయోజనాలు పొందకుండానే సాగిలపడింది. ఇరాన్ నుంచో, రష్యా నుంచో, మరో చోట నుంచో చమురు కొనుగోలు చేయాలని అమెరికా ఎలా నిర్ణయిస్తుంది? మీరు భరతమాతను అమ్మేశారు. మీరు సిగ్గుపడాలి. అమెరికా ఒత్తిడితో మోదీ వణికిపోయారు. దేశాన్ని అమ్మేశారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడ్డారు‘ అని రాహుల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ఉద్యోగులకు ఆరోగ్యమస్తు

**త్వరలోనే 1,056 కోట్లతో బీమా పథకం.. ప్రభుత్వం, ఉద్యోగుల చెరి సగం వాటా**

**సిబ్బంది మూల వేతనం నుంచు? 1.5 కట్**

**'ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్టు' ద్వారా సేవలు -15 రోజుల్లో పథకం ప్రారంభానికి చర్యలు**

హైదరాబాద్,. **ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం తీపి కబురు అందించనుంది. ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నూతన ఆరోగ్య పథకాన్ని 15 రోజుల్లో ప్రారంభించాలని సర్కారు నిర్ణయించింది. త్వరలోనే దీనికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేయనుంది. ఇది అమల్లోకి రాగానే రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు 12,84,532 మందికి వర్తించనుంది. ఈ పథకం కోసం ఉద్యోగులు, పెన్షనర్ల వాటా, ప్రభుత్వ వాటా కలిపి సంవత్సరానికి రూ.1,056 కోట్లు కార్పస్ ఫండ్ జమ కానుంది. ఈ పథకంపై గురువారం సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘాలు, సచివాలయ ఉద్యోగుల సంఘం, తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్, టీఎస్ యూటీఎఫ్, పీఆర్‌టీయూ, తెలంగాణ రిటైర్డ్ అధికారుల సంఘం, తెలంగాణ ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం, తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా 15 రోజుల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమక్షంలో ఈ పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

# జాతీయ స్థాయిలో ధర్మసాగర్ బాలుడి సత్తా

## సాఫ్ట్బాల్‌లో కార్తీక్ ప్రతిభ పాఠశాలలో ఘన సన్మానం





**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త);** ధర్మసాగర్‌కు చెందిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి దేవర కార్తీక్ జాతీయ సాఫ్ట్బాల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ కనబరిచాడు. ఫిబ్రవరి తొలి వారంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో తన క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకుని మండలానికి గర్వకారణంగా నిలిచాడు. కార్తీక్ విజయాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ధర్మప్రకాశ్ అధ్యక్షతన ఘన అభినందన సభ నిర్వహించారు. జాతీయ స్థాయిలో పోటీ ఇచ్చి ప్రతిభ చాటిన కార్తీక్‌పై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా కృషి, పట్టుదలతో జాతీయ స్థాయిలో రాణించగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఎఫ్‌బి హెచ్ హెచ్ ఎస్ ఎన్జీవో సంస్థ తరపున చంద్రశేఖర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హాజరై, మనీష్ గోరె అందించిన ఆర్థిక సహాయాన్ని కార్తీక్‌కు అందజేశారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని వారు తెలిపారు. కార్తీక్‌ను పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయికి తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రసన్నను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించారు. ఆమె మార్గదర్శకత్వమే ఈ విజయానికి మూలకారణమని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, కిరణ్ మై, రామకృష్ణ, సుధీర్ రెడ్డి, రమ్యశ్రీ పాల్గొన్నారు. కార్తీక్ విజయం స్థానిక యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# క్షయపై ఆందోళన అవసరం లేదు

## ఉచిత చికిత్స, పరీక్షలు అందుబాటులోనే



**తల్లాడ/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** క్షయ వ్యాధిపై అపోహలు పెట్టుకోవద్దని, ఇది పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని కల్లూరు డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రదీప్ స్పష్టం చేశారు. తల్లాడ మండల పరిధిలో క్షయ రోగులకు పోషకాహార ఫుడ్ బాస్కెట్ కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
ఆర్‌బీఎస్‌కే వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష సమక్షంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ చేతుల మీదుగా టిబి రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ బాస్కెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు, మందులు అందిస్తున్నదని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. సరైన సమయంలో చికిత్స ప్రారంభిస్తే త్వరగా కోలుకోవచ్చని చెప్పారు. అలాగే క్షయ రోగులకు పోషకాహారం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, తల్లాడ మండలంలో దాతలు ముందుకు వచ్చి ఫుడ్ బాస్కెట్ కిట్లు అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రోగులను సమాజం దూరం పెట్టకుండా మానసిక ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, క్షయ చికిత్స సూపర్వైజర్ వై. సురేష్, హెల్త్ సూపర్వైజర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# 2వ డివిజన్‌లో టీడీపీ స్థలంపై ఉద్రిక్తత

## ఆక్రమణ యత్నాన్ని అడ్డుకున్న శ్రేణులు జెండా పాతి స్వాధీనం

**ఖమ్మం/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం నగరంలోని 2వ డివిజన్ (పాండురంగపురం) ప్రాంతంలో టీడీపీకి కేటాయించిన స్థలంపై ఆక్రమణ యత్నం ఉద్రిక్తతకు దారి తీసింది. సమాచారం అందుకున్న వెంటనే పెద్ద ఎత్తున గుమిగూడిన టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1999లో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇండ్లు లేనివారికి సుమారు 150 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అదే సమయంలో పార్టీ కార్యాలయం కోసం 85 గజాల స్థలాన్ని అప్పటి ఖమ్మం తహసీల్దార్ కేటాయించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం ఆ స్థలంలో టీడీపీ దిమ్మె నిర్మించి జెండా ఎగరవేస్తూ పార్టీ అధీనంలో కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఇటీవల కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దొంగ పట్టా సృష్టించి ఆ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణ పనులు చేపట్టే ప్రయత్నం



చేశారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న స్థానికులు వారితో వాగ్వాదానికి దిగడంతో పాటు పార్టీ కార్యాలయానికి సమాచారం అందించారు.
దీంతో జిల్లా నాయకులు కేతినేని హరీష్ చంద్ర, గుత్తా సీతయ్య, వాసిరెడ్డి భాస్కరరావు, వనమా వాసు, వడ్డేం విజయ్ తదితరులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని నిరసన తెలిపారు. జేసీబీ సహాయంతో స్థలాన్ని శుభ్రపరిచి మళ్లీ పార్టీ జెండా పాతి స్వాధీనం చేసుకున్నారు.
ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షుడు, కార్యదర్శి కృష్ణమాచారి, యల్లంకి నరసింహారావు, పోట్ల నాగేశ్వరరావు, మందడపు సుధాకర్, మహిళా నాయకురాలు వేగినాటి ఉమ, తాడిశెట్టి స్వాతి, అనిత, మంగమ్మ, పావని, లావణ్య, ఝాన్సీ, నాయకులు చంద్ర రవి, పెనుగొండ ఉపేందర్, గుండెపిన్నీ నాగేశ్వరరావు, కన్నెటి పృథ్వీ, నాగండ్ల లక్ష్మణ్, కొలికొండ మురళి, చింతనిప్పు నాగేశ్వరరావు, గుడిపూడి నాగేశ్వరరావు, ఎర్నం జేమ్స్, చావా నరేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీకి కేటాయించిన స్థలంపై ఎవరైనా అక్రమంగా దృష్టిపెడితే సహించబోమని నాయకులు హెచ్చరించారు. అవసరమైతే చట్టపరమైన పోరాటం కూడా చేస్తామని స్పష్టం చేశారు.

# కొండ్రెడ్డి భద్రమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించిన మాజీ సొసైటీ ఛైర్మన్.



**బయ్యారం/ఫిబ్రవరి12(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండ్రెడ్డి సోమరెడ్డి మతృమూర్తి భద్రమ్మ వయోభారంతో గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న బయ్యారం సొసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి, తిరుమల చంద్రరెడ్డి భద్రమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
భద్రమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, భద్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఎస్కే.జానీ, కాంగ్రెస్ నాయకులు పగడాల శ్రీనివాస్, నాశపొయిన గణేష్, ఇతర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు.



**బయ్యారం/ఫిబ్రవరి 12(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ్రేడ్డి సోమిరెడ్డి మతృమూర్తి కొండ్రేడ్డి భద్రమ్మ (90) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. భద్రమ్మ భౌతికకాయాన్ని సందదర్శించిన కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ములుకురి వీరారెడ్డి, జిల్లా కిసాన్ సెల్ ప్రధానకార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు, నందగిరి భద్రయ్య, నామా బాబురావు, తాటి జనార్ధన్, రామగిరి వెంకటేశ్వర్లు, బీరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

## నర్సంపేటలో రాస్తారోకోడ జాతీయ సమ్మెలో భాగంగా ఆందోళన

**నర్సంపేట/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని టీజేఏసీ రాష్ట్ర నాయకులు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం నర్సంపేట మండలం ఇటకాలపల్లి గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అంబటి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ప్రభుత్వం పదకొండు సంవత్సరాల పాలనలో పెట్టుబడిదారులకు అనుకూల విధానాలను అమలు చేస్తూ కార్మికరైతు వర్గాల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు కష్టపడి సంపాదించిన సంపదను కార్పొరేట్ సంస్థలకు రాయితీల రూపంలో అందజేస్తూ, కార్మికులు సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు.
కార్మికులు సాధించిన 28 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి హక్కులను హరించారని అన్నారు. ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచేలా చర్యలు తీసుకోవడం, సమ్మె హక్కును పరిమితం చేయడం, వేతన సవరణలపై ఆంక్షలు విధించడం వంటి






నిర్ణయాలు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేకూరుస్తాయని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, గతంలో కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు భరించే విధానం ఉండగా ఇప్పుడు కేంద్రం వాటాను తగ్గించి రాష్ట్రాలపై భారాన్ని మోపుతోందని విమర్శించారు. దీని వల్ల గ్రామీణ కూలీల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.
రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఎరువులుపురుగుమందుల ధరలు పెరగడం, పెట్టుబడులు అధికమవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. విద్యుత్ సంస్కరణల బిల్లు, కొత్త విత్తన చట్టం వంటి నిర్ణయాలు రైతాంగానికి హానికరమని, వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలుగా అభివర్ణించారు.
ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, ప్రజా ఉద్యమ నాయకులను ఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందని ఆరోపిస్తూ, ప్రజలు మత విద్వేషాలకు లోనుకాకుండా ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్కే అన్వర్, పెండ్యాల సారయ్య, గోనె మల్లారెడ్డి, వంగాల వనాచారి, బస్కె మొగిలి, ఇండ్ల కొమ్ములు దేశం రాములు, ఎస్కే నజీర్ రాజు, మండల పైడి రాజు, నల్లగొండ సంజీవ, కాటిపాకల చేరాలు, మండల సదయ్య, నాయిని మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మె విజయవంతం.



**బయ్యారం/ఫిబ్రవరి12(జర్నలిస్ట్ వార్త);** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం బయ్యారం మండల కేంద్రంలో నిర్వహించిన అఖిల భారత సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకుని, పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, జిల్లా కిసాన్ సెల్ ప్రధానకార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వర రావు, నాయిని శ్రీనివాస్ రెడ్డి, ములుకురి వీరారెడ్డి, నందగిరి భద్రయ్య, జనార్ధన్, రామగిరి వెంకటేశ్వర్లు, కడపకొండ మహేందర్ రెడ్డి, రామగిరి వెంకటేశ్వర్లు, ఆకునూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో జయభేరి మోగించిన నారాయణగిరి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు అర్హత

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి12 (జర్నలిస్ట్ వార్త)** ధర్మసాగర్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ నారాయణగిరి పాఠశాల మరోసారి క్రీడారంగంలో తన ప్రతిభను చాటుకుంది. ఈ నెల 9, 10 తేదీలలో హనుమకొండ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన జిల్లా స్థాయి "సీఎం కప్" క్రీడా పోటీల్లో పాఠశాల విద్యార్థులు విశిష్ట ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది. జిల్లా నలుమూలల నుండి భారీగా పాల్గొన్న క్రీడాకారుల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, నారాయణగిరి పాఠశాల విద్యార్థులు ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, పట్టుదలతో ముందంజ వేసి విజయం సాధించారు. ఎ. అన్వేష్, జి. మల్లీశ్వర్, సిహెచ్. శరవణ్, కె. అర్వన్‌వర్మ, సుమంత్, జి. శ్రీరామ్‌లు తమ తమ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ స్థాయిలో మెరుగు చూపడం విశేషంగా నిలిచింది. పరిమిత వనరుల మధ్య



కూడా క్రమబద్ధమైన సాధన, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థుల కఠిన సాధనకు ఫలితం దక్కడం పాఠశాలకు మరింత ఉత్సాహాన్ని నింపింది. విద్యార్థుల విజయంపై గ్రామ సర్పంచ్ పుట్ట రేణుక హర్షం వ్యక్తం చేస్తూ, "గ్రామ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి చేరడం గర్వకారణం. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం" అన్నారు. ఏఏపీసీ చైర్మన్ కనకలక్ష్మి కూడా విద్యార్థులను అభినందిస్తూ, క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామదాస్ గారు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు కూడా సమాన ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందిస్తాయని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులను రాష్ట్ర స్థాయికి చేర్చడంలో కీలక పాత్ర పోషించిన ఫిజికల్ డైరెక్టర్ ఎం. సురేష్ బాబు కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రతిరోజూ క్రమబద్ధమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రోత్సాహం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. గ్రామస్థులు, తల్లిదండ్రులు కూడా విద్యార్థులను అభినందిస్తూ వారి విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించడం ద్వారా పాఠశాల ఖ్యాతిని మరింత ఎత్తుకు చేర్చారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే జోష్ కొనసాగించాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# ఉచిత ఎలక్ట్రిక్ బైక్ మెకానిక్ శిక్షణ

## ముల్కనూరు ఎస్ఆర్‌కేలో అర్హులైన యువత నమోదు చేసుకోవాలి



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ముందుకొచ్చిందని హుస్నాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. భీమదేవరపల్లి మండలానికి చెందిన అభ్యర్థులకు వరంగల్‌లో 52 రోజులపాటు ఉచిత ఎలక్ట్రిక్ బైక్ మెకానిక్ శిక్షణ ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బైక్‌లు మరియు పెట్రోల్ బీఎస్-6 వాహనాల మరమ్మత్తులపై ప్రత్యేక శిక్షణ అందించబడుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) సర్టిఫికెట్ అందజేయనున్నట్లు వెల్లడించారు. శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి మరియు భోజన సదుపాయం కల్పించబడుతుందని చెప్పారు. ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, వొకేషనల్ కోర్సులు పూర్తిచేసి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో ముల్కనూరులోని ఎస్ఆర్‌కే స్కూల్‌లో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9676235640, 9014697041 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# సేవాభావానికి నిదర్శనం

## మదర్ థెరిస్సా సేవాసదనంలో అన్నవితరణ

### మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో నివాళులతో సేవా కార్యక్రమం





**మధిర/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** మధిర నియోజకవర్గ పరిధిలోని మదర్ థెరిస్సా సేవాసదనము మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో గురువారం భావోద్వేగ వాతావరణంలో అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. తిప్పినేని కోటేశ్వరరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆదరణ, ఓదార్పు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ మానసిక దివ్యాంగ చిన్నారులకు భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల తరపున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోటేశ్వరరావు సేవా మనోభావాన్ని స్మరించుకుంటూ ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఫాతిమా నవాజ్ పవిత్ర ఆత్మకు విశ్రాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చేకూరాలని ప్రార్థిస్తూ మరో విడతగా అన్నవితరణ చేపట్టారు. సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా సోదరి అనిత రెంటల పాల్గొని చిన్నారులకు అన్నప్రసాదం అందజేశారు. సేవాసదన నిర్వాహకులు, సిబ్బంది కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. మానవతా విలువలను చాటిచెప్పే ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

# ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం ఆహ్వాన కరపత్ర ఆవిష్కరణ.



**బయ్యారం/ఫిబ్రవరి 12(జర్నలిస్ట్ వార్త);** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఇండస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ఇండస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే మహాశివరాత్రిఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంఆహ్వాన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం గురువారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం 15 ఫిబ్రవరి సాయంత్రం 5:30 ల నుండి తెల్లవారు జామున(సోమవారం) 5:00ల వరకు హయగ్రీవాచారి గ్రౌండ్స్ హన్మకొండ లో నిర్వహించబడును. ఈ కార్యక్రమంలో బయ్యారం మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆజ్మీర కల్పనా సునీల్ నాయక్,నీలారపు సంపత్ యాదవ్,రచ్చ చంద్రమౌళి, హరీష్ యాదవ్,సందీప్ యాదవ్ చందు,మహేష్ యాదవ్,వార్డ్ మెంబర్ భూక్య నరేష్ తార,భూక్య భావుసింగ్ నాయక్,ఆజ్మీర శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్ర్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు

## ఐదుగురికి పైగా గుంపులుగా చేరరాదు: పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ హెచ్చరిక




**హనుమకొండ బ్యూరో ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ తెలిపారు. జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట ప్రాంతాల్లో శుక్రవారం కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్.ఎస్. సి.ఆర్.పి.సి 163 సెక్షన్ ప్రకారం ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధించబడిందని వెల్లడించారు. ఈ నిషేధాజ్ఞలు శుక్రవారం ఉదయం 6 గంటల నుండి 14వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# ఇండెల్ మనీ శాఖలో డిగ్రీ విద్యార్థుల సందడి

## బ్యాంకింగ్ రంగంపై ప్రత్యక్ష అవగాహన




**నర్సంపేట/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేట వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన క్షేత్ర పర్యటన ఆసక్తికరంగా సాగింది. 'జిజ్ఞాస' స్టడీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇండెల్ మనీ నర్సంపేట శాఖను సందర్శించిన విద్యార్థులు బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ, పాఠ్యాంశాలను ప్రాయోగిక అనుభవంతోనుసంధానించడం విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల పాత్ర, రుణాల ప్రక్రియ, కస్టమర్ సేవల నిర్వహణ వంటి అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా విద్యార్థుల్లో విశ్లేషణాత్మక దృష్టి పెంపొందుతుందని పేర్కొన్నారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. సోమయ్య మాట్లాడుతూ, తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేస్తున్నారో ఈ పర్యటన ద్వారా విద్యార్థులు అవగాహన పొందారని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న ఆధునిక మార్పులు, ఆర్థిక సేవల విస్తరణ, రుణాల మంజూరు విధానాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కలిగిందన్నారు. ఇండెల్ మనీ నర్సంపేట బ్రాంచ్ మేనేజర్ శ్యామల రాజు విద్యార్థులకు శాఖ కార్యకలాపాలపై సవివర వివరణ ఇచ్చారు. బంగారం రుణాలు, వ్యక్తిగత రుణాలు, వడ్డీ విధానం, కస్టమర్ సేవా ప్రమాణాలు, శాఖ నిర్వహణ విధానాలపై వివరించి, విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. శాఖ సిబ్బంది కూడా ఆర్థిక లావాదేవీల ప్రాసెస్‌ను ప్రదర్శించి, ప్రత్యక్ష అనుభవాన్ని కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా వాణిజ్యశాస్త్ర విభాగం తరఫున బ్రాంచ్ మేనేజర్ శ్యామల రాజు మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా పర్యటనకు అనుమతి ఇచ్చిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్‌కు విభాగాధిపతి డాక్టర్ ఎం. సోమయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్షేత్ర పర్యటన విద్యార్థులకు ప్రాయోగిక జ్ఞానం అందించి, భవిష్యత్ విద్యాఉద్యోగ అవకాశాలకు మార్గదర్శకంగా నిలిచిందని అధ్యాపకులుఅభిప్రాయపడ్డారు.

# తల్లాడలో కార్మిక జేఏసీ గర్జన

## కేంద్ర కార్మికకర్షక విధానాల రద్దు డిమాండ్




**తల్లాడ/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మికకర్షక వ్యతిరేక విధానాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తల్లాడ మండల కేంద్రంలో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఉధృతంగా సాగింది. మండల కేంద్రం కదిలిపోయేలా భారీ ర్యాలీ నిర్వహించిన కార్మికులు నినాదాలతో మార్మోగించారు. ప్రభుత్వ విధానాలు కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ వంటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.
ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ అనంతరం బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభకు సిపిఎం మండల కార్యదర్శి అయినాల్ రామలింగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మిక చట్టాలలో మార్పుల పేరుతో కార్మికుల హక్కులను కుదించే చర్యలు అంగీకారయోగ్యం కాదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానం విస్తరణ, పెన్షన్ భద్రత లోపం వంటి అంశాలు కార్మిక వర్గాన్ని సంక్షోభంలోకి నెట్టుతున్నాయని విమర్శించారు.
రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడుతూ, కార్మికరైతు ఐక్యతే ప్రజాస్వామ్యానికి బలమని అన్నారు. టియుసిఐ జిల్లా నాయకుడు డి. శ్రీనివాసరావు, సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు షేక్ లాల్మియా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలు పెద్ద కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉండి, కార్మికరైతు వర్గాలకు భారంగా మారాయని ఆరోపించారు. సిఐటియు జిల్లా నాయకుడు సత్తెనపల్లి నరేష్, రైతు సంఘం జిల్లా నాయకుడు తాత భాస్కరరావు మాట్లాడుతూ, కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ వంటి డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు షేక్ మస్తాన్, గుడిపల్లి కృష్ణ, చిర్రా లింగయ్య, ఇమ్మడి రామకృష్ణ, షేక్ ఇబ్రహీం, అంగన్వాడి నాయకురాలు నాగమణి, ఆశా వర్కర్ల నాయకురాలు తాళ్ల రాణి, సిపిఎం నాయకులు నల్లమోతు మోహన్‌రావు, పులి వెంకటనరసయ్య, మన్నేపల్లి రామారావు, ఆదూరి జీవరత్నం, రాజబోయిన సైదులు, షేక్ నన్నే సాహెబ్, పెరసాని వెంకటయ్య, మేడి బిక్షం, మన్నేపల్లి అర్జున్‌రావు, ధరావత్ వెంకటేశ్వర్లు, దుగ్గిదేవర సత్యం, మేడి అశోక్, దడిపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.
సమ్మెకు వామపక్ష పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించి, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జరిగే ప్రతి ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికుల ఐక్యత, పట్టుదలతో ఈ సమ్మె విజయవంతమైందని జేఏసీ నేతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సమస్యలు పరిష్కారం కానట్లయితే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రిపోర్టర్ సురేష్ కుటుంబానికి ఐజేయు అండ

## రూ.20 వేల తక్షణ సాయం ఇద్దరు పిల్లలకు 10వ తరగతి వరకు ఉచిత విద్య హామీ






**తల్లాడ/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల మనప్రగతి రిపోర్టర్ అద్దంకి సురేష్ ఆకస్మిక మృతి జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర విషాదాన్ని కలిగించింది. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న సురేష్ మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ నేపథ్యంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) తల్లాడ మండల కమిటీ మానవీయ దృక్పథంతో ముందుకు వచ్చి అండగా నిలిచింది. సురేష్ కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.20 వేల నగదు అందజేశారు. కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న సంఘ నాయకులు చిన్నారుల భవిష్యత్తు విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఐజేయు మండల కమిటీ గౌరవ అధ్యక్షులు టీకే ప్రసన్నన్ ఆధ్వర్యంలోని యూనివర్సల్ విద్యాలయంలో సురేష్ ఇద్దరు చిన్నారులకు 10వ తరగతి వరకు ఉచిత విద్యను అందించనున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, కార్యదర్శులు ఎండి బహుదూర్, దేవబత్తిని సీతారాములు, గౌరవ అధ్యక్షులు టీకే ప్రసన్నన్, దాసరి శ్రీనివాసరావు, గొడ్ల బాబురావు, ఇస్నపల్లి శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, నారపోగు ప్రసాద్, గొడ్ల నరసింహారావు, గొల్లమందల ప్రేమ్‌కుమార్, బోనాసి శ్రీనివాసరావు, కాంపాటి రవి, వేము విజయ్, రేగళ్ల శ్రీనివాసరావు, కొత్తపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.
సురేష్ ఆత్మకు శాంతి చేకూరాలని సభ్యులు నివాళు లర్పించారు.


# పని లేక పస్తులు

## ఉపాధి పనికే బుక్ అడ్డంకి

### నేలకొండపల్లి మండలం, చెన్నారం గ్రామంలో దయనీయ పరిస్థితి



**నేలకొండపల్లి/ఫిబ్రవరి12(జర్నలిస్ట్ వార్త);** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన పుట్టబంతి పాపమ్మ ఉపాధి కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద పని చేయాలని పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఇప్పటికీ జాబ్ కార్డు (ఉపాధి బుక్) జారీ కాలేదని ఆమె వాపోతున్నారు. పని లేక పస్తులు పడుతున్నాం. ఉపాధి పనికి వెళ్దామంటే ముందుగా బుక్ కావాలంటున్నారు. చాలా కాలంగా మొరపెట్టుకున్నా బుక్ ఇవ్వడం లేదు. పని లేదు ఆదాయం లేదు ఈ వేసవి మొత్తం ఎలా బ్రతకాలా? అని పాపమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పరిస్థితి మరింత విషమంగా ఉందని ఆమె తెలిపారు. ఇంట్లో ఉన్న వృద్ధుడికి పక్షవాతం రావడంతో పని చేయలేని స్థితి నెలకొంది. కుటుంబ భారం మొత్తం తనపై పడిందని, పని చేసి సంపాదించాలన్నా అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని చెప్పారు. చేతిలో పైసా లేక రోజువారీ జీవనం కష్టంగా మారిందని ఆమె బాధ వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు కనీసం 100 రోజుల ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం, అర్హులకు చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జాబ్ కార్డుల జారీ విషయంలో ఆలస్యం, నిర్లక్ష్యం కారణంగా నిజంగా అవసరమైనవారు పనికి దూరమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పని చేసి తినే అవకాశమే లేకపోతే మా కడుపు ఎలా నిండుతుంది? అధికారులు కరుణించరా? అంటూ పాపమ్మ ప్రశ్నిస్తున్నారు. వెంటనే జాబ్ కార్డు జారీ చేసి ఉపాధి కల్పించాలని గ్రామస్తులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పేదల కన్నీళ్లు తుడిచేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపుతారా? లేక సమస్య యథాతథంగా కొనసాగుతుందా? అన్నది వేచి చూడాల్సిందే.




# మహాశివరాత్రి వేడుకలకు ఆహ్వానం





రాయపర్తి/ఫిబ్రవరి12(జర్నలిస్ట్ వార్త): ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ లోని హయగ్రీవాచారి మైదానంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమానికి హాజరు కావాలని మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి నీ గురువారం ఇండస్ ఫౌండేషన్ సభ్యులు నవీన్ యాదవ్ ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గజవెల్లి అనంత ప్రసాద్,బిల్లా వెంకట్ రెడ్డి, పరుపాటి రవీందర్ రెడ్డి, కోలా సంపత్, సంకినేని ఎల్లస్వామి, ఉబ్బని సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
శుక్రవారం13 ఫిబ్రవరి 2026

# ప్రజారంజకపాలనే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తా.

## సర్పంచ్ బిల్ల యాదగిరి.





**వేలేరు/ఫిబ్రవరి12(జర్నలిస్ట్ వార్త ):**వేలేరు గ్రామంలోని ప్రజల సంక్షేమం దిశగా ప్రజారంజక పాలనే ధ్యేయంగా పరిపాలన కొనసాగించడానికి ప్రభుత్వ అధికారులు ప్రజాప్రథినిధులు గ్రామస్తులు సహకరించాలని వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి అన్నారు. గురువారం వేలేరు మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామసభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ యాదగిరి మాట్లాతూ పాఠశాల సమీపంలోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని దాన్ని వెటనే డిస్మెంటల్ చేసి నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయడమే కాకుండా పాఠశాలల ప్రాంగణం చుట్టూ ప్రహారి గోడ కూల్చివేతతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని గ్రహించిన ఎంఎల్ఎ కడియం శ్రీహరి ప్రహారి గోడ నిర్మాణంతో పాటుగా మహిళా భవనాలకు నిధులు మంజూరు చేశారని త్వరలోనే ఎంఎల్ఎ కడియం శ్రీహరి ద్వారా శంకుస్థాపన చేయించడం జరుగుతుందని అలాగే గ్రామంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మంజూరైనవారు ఆర్థిక పరిస్థితుల కారణంగా నిర్మాణం చేపట్టనటువంటి వారికి ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఓసొసైటీ ద్వారా వారేనిర్మించే కార్యక్రమం ఉంది కనుక అలాంటి అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకుంటే మళ్లీ రెండవ విడుత 60 ఇండ్లను ఎంఎల్ కడియం శ్రీహరి మంజూరు చేస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో హనుమకొండ జిల్లాలోనే వేలేరు మండలం ద్వితీయ స్థానంలో ఉండడం మనం గర్వించదగిన విషయంగా భావించాలని తెలుపుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు సమయ పాలన పాటిస్తూ సకాలంలో చికిత్సను అందించాలని కోరారు.

**వాష్ రూమ్ లు నిర్మాణానికి శంకుస్థాపన..**

వేలేరు మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం వాష్ రూమ్ లతో పాటు ఇంకుడుగుంతల నిర్మాణానికి శంకుస్థావన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిలి, ఉపసర్పంచ్ కోడూరి శ్రీకర్, పిఆర్ ఎఇ రూపావతి,హెచ్ఎంలు సత్తయ్య, లీలాభాయి, హౌజింగ్ ఎఇ జాన్సి, గ్రామపంచాయితీ కార్యదర్శి రవిందర్, వైద్యసిబ్బంది ఆశాకార్యకర్తలు, అంగన్వాడిటీచర్లు, వార్డుసభ్యులు, గ్రామపంచాయితీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

### ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మికసాంస్కృతిక సమ్మేళనం





**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త);**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15న హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో సాయంత్రం 5.30 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఆధ్యాత్మికసాంస్కృతిక సమ్మేళనం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిదంపతులు పార్వతీ పరమేశ్వరుల శివపార్వతీ కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ రాధా మనోహర్ దాస్ ప్రవచనం ఇవ్వనున్నారు. పద్మశ్రీ మొగిలయ్య కిన్నెర కళారూప ప్రదర్శనతో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు ఆర్‌పి పట్నాయక్ స్వరాభిషేకంతో శివభక్తి గీతాలను ఆలపించనున్నారు. నల్గొండ గద్దర్ జానపద జాతర, జాతీయ ఉత్తమ గేయ రచయిత కాసర్ల శ్యామ్ గేయ సందేశం, కొదారి శ్రీనివాస్ జానపద సందడి ప్రత్యేక ఆకర్షణలుగా నిలవనున్నాయి. కాకతీయుల కాలాన్ని గుర్తు చేసే పేరణి శివతాండవం నృత్యప్రదర్శన, లింగోద్భవ సమయంలో సప్తహారతి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకోనున్నాయి. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు కాకతీయ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని సోమదేవరపల్లి గ్రామ సర్పంచ్ నాగర్ల కృష్ణమూర్తి గురువారం ప్రభుత్వ అధికారులను, జర్నలిస్టులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజలు, అధికారులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9060102521, 9063995609 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# కౌంటింగ్‌కు మూడంచెల భద్రత

### సభలు, ర్యాలీలకు అనుమతి లేదు -ఏసీపీ అంబటి నర్సయ్య స్పష్టం

**వర్ధన్నపేట/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ మరియు కౌంటింగ్ కేంద్రాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య గురువారం పరిశీలించారు. శుక్రవారం నిర్వహించనున్న ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని చేపట్టిన భద్రతా చర్యలను ఆయన సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడు స్థాయిల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెఖీరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, ప్రవేశనిష్క్రమణ ద్వారాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, కేంద్రాల వద్ద మూడంచెల భద్రత అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు, డీజేలు ఏర్పాటు, బాణసంచా కాల్చడం వంటి కార్యక్రమాలపై పూర్తిగా నిషేధం అమలులో ఉందని స్పష్టం చేశారు. అలాంటి కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదన్నారు. చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ ఈ నెల 16న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నియమ నిబంధనల ప్రకారం సాగేందుకు ప్రజలు సహకరించాలని ఏసీపీ కోరారు.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డులు

### పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం - సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. పక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

### వర్ధన్నపేటలో కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ డా. సత్య శారద





**వర్ధన్నపేట/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త):** రెండవ ఆర్డినరీ మునిసిపల్ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్స్‌లో టేబుళ్ల అమరిక, సిబ్బంది నియామకం, స్ట్రాంగ్ రూమ్ భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అభ్యర్థుల ఏజెంట్లకు కేటాయించిన సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లెక్కింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ ప్రతి రౌండ్ ఫలితాలను సమయానుకూలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

శుక్రవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, మొత్తం మూడు రౌండ్లలో నాలుగు టేబుళ్ల ద్వారా లెక్కింపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రాంరెడ్డి, వరంగల్ ఆర్డీఓ సుమ, వర్ధన్నపేట సీఐ కె. శ్రీనివాసరావు, తహసిల్దార్ విజయ్ సాగర్, మునిసిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాటికొండలో కార్మికుల భారీ ర్యాలీ



**స్టేషన్ ఘన్ పూర్/ఫిబ్రవరి 12 (జర్నలిస్ట్ వార్త ) :**
మండలంలోని తాటికొండ గ్రామంలో సిఐటియు, ఏఐటిసి ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జనగాం జిల్లాఘనపూర్ మండలంలోని తాటికొండ గ్రామం లో మేస్త్రీలసంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యు డు మారాపాక వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి బట్టు ఏలీయా, గ్రామ శాఖ అధ్యక్షుడు ఒడితం తిరుపతి, ఉపాధ్యక్షుడు జక్కుల శివ, ప్రధాన కార్యదర్శి రాజు, నాయకులు యారా రవి, గోదారి బిక్షపతి,మారపాక యాదయ్య, రమేష్ నారాబోయిన నాగరాజు,రొయ్యలపెద్ద కనకయ్య, రమేష్, కొమురయ్య, రోడ్ద రాజు,రొయ్యల కుమా ర్ (బచ్చ), రొయ్యల సమ్మయ్య, తరాల నరసిం హులు, రాజు, కుమార్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ గుడి అభివృద్ధి పనులను పరిశీలించిన శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి/ఫిబ్రవరి12(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని జేతురాం తండ గ్రామ పంచాయితీ పరిధిలోని విద్యా నగర్ తండలోని దుర్గమ్మ గుడికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక లక్ష యాభై వేల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రహరీ గోడ,టైల్స్ పనులను గురువారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి,నేతావత్ మన్సుర్, నేతావత్ శ్రీధర్, నేతావత్ రాజేష్, నేతావత్ యాదయ్య, జాటోత్ బాధ్రు, జాటోత్ శ్రీను, జాటోత్ రమేష్, నేతవత్ భీమ్లా, రవి, వెంకన్న, ప్రవీణ్, వెంకన్న, చిన్న వెంకన్న, సోమన్న, రాజేష్, రామోజీ, మురళి, లచ్చిరాం,తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ




**రాయపర్తి/ఫిబ్రవరి12(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని బురహన్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖమ్మంపాటి సోమ్మయ్య తండ్రి ఖమ్మంపాటి సత్తయ్య ఆనారోగ్యంతో మరణించగా గురువారం ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణా రెడ్డి,గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇంతలా వీరా రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొమ్మెర కళ్యాణ్,టీ కృష్ణమాచార్యులు,మాచర్ల ప్రభాకర్,భూక్యా సమ్మయ్య,పెండ్లి మహేందర్ రెడ్డి,మచ్చ రమేష్ తదితరులు పాల్గొన్నారు.